నిజం కావలసిన కలలు

"నెలకు నూటఏభై రూపాయల జీతం...ఉదయం పదిన్నర నుంచి సాయంత్రం ఐదుదాకా ఆఫీసులో ఉండాలి...మలకపేటలో క్వార్టర్స్...నూటికి పదిరూపాయల వంతున నూటఏభై రూపాయల జీతానికి పదిహేనురూపాయలు అద్దె! మూడు గదులుంటాయి...అన్నీ ప్రత్యేకం..."

బయట తలుపుతట్టిన చప్పుడయింది! కలకరిగిపోయింది...ఎంత తియ్యటికల చెరిగిపోయింది...ఈ కల నాకు మేల్కొని ఉండగానే వచ్చినట్లుంది...ఎందుకంటే నిద్రనుంచి మేల్కొని చాలా సేపయింది! చాపమీద ఊరికే పడుకున్నాను...మళ్ళా ముసుగు పెట్టుకొని పడుకోవాలినిపించింది ... నిద్రబోతున్నట్లు నటించాలనిపించింది...కాని లాభంలేదు! తలుపు ఎవరు తట్టిందీ నాకు తెలుసు ! ప్రతి నెలారంభంలోనూ...ఇలాంటి చప్పుడే అవుతుంది...వెంకటసుబ్బయ్యగారి గుమాస్తా తలుపు తట్టడమేమిటి?...తను గుర్తించకపోవడ మేమిటి ? వెంకటసుబ్బయ్యగారు కూడా చాలా తెలివైనవాడు...అద్దెలు వసూలుచేసే గుమాస్తాను వెతుక్కోవటంలో ఆయన చాలా దూరదృష్టిని ప్రదర్శించాడనే చెప్పాలి ... పొడుగాటి మీసాలు, ఐదుగురు మనుషుల్ని అమాంతంగా ఒకచేత్తో ఎత్తి మేడపైనుంచి కింద పడేయగల వస్తాదు! నిప్పుకణాల్లాగా ఎప్పుడూ ఎర్రగామండే

కళ్లు...చేతులో బాణాకర్ర ... చిన్నపిల్లలు చూస్తేమటుకు దడుచుకుంటారు...ఇక నా విషయం? చెప్పకుండా ఉంటేనే మంచిది...అతన్ని ఊహించుకుంటేనే నావళ్లు జలదరిస్తుంది.

మళ్లీ తలుపుతట్టిన చప్పుడు!

కొంచెం స్తిమితపడ్డాను.

నా గదితలుపు కాదు తట్టింది ... నా పక్కగది తలుపు...

కొంచెం ధైర్యం వచ్చింది.

కాని ధైర్యంగా నిలబడాల్సిన సమయం కాదిది! తన ధైర్యం ఆ గుమాస్తాముందు ఏపాటిది? నాకు కలిగిన ధైర్యాన్ని తీసిమూలగా విడిచిన బట్టలబుట్టలో దాచి - చాపమీదినుంచి లేచి వళ్లు విరుచుకున్నాను.

ఆలోచిస్తూ నిల్చున్నా!

కాని ఇది ఆలోచించాల్సిన సమయం కాదు...తరుణోపాయం చూచుకోవలసిన తరుణం! ... పలాయన మంత్రం పఠించకపోతే వస్తాదు గుమాస్తా పలికే దుర్భాషలకు తాళజాలగలగటం దుర్భరాతి దుర్భరం!

పక్కగదిలో పనిపూర్తి చేసుకున్న వెంటనే అతగాడతి దూకుడుగా...తన గదిని ప్రవేశించవచ్చు.

సబ్బుతో మొహం కడుక్కున్నాను.

వంకెకు తగిలించిన బట్టలు తీస్తున్నాను. పక్కగదివైపు కొంచెం చెవిఒగ్గి విన్నాను—

తలుపు తెరిచిన శబ్దం...

"ఓహో ! మీరా ? గుమాస్తాగారూ !" అంటున్నాడు. ఆ గదిలో వుంటున్న నారాయణరావు.

"అవును...నేనే...నారాయణరావుసాబ్ !"- గుమాస్తా బొంగురుగొంతు.

"రండి, లోనికిరండి...చాపమీద కూర్చోండి !"

"అబ్బే ! నాకు ఆటే టైంలేదు ... ఇవ్వాళ వసూళ్లు చాలా ఉన్నాయి !"

"ఆఁ ఏమిటండీ!...కూర్చోండి...చాయ్ తాగి వెళ్దురు గాని."

నాకు నారాయణరావు మీద ఎక్కడలేని ప్రేమ పుట్టుకొచ్చింది..."మిత్రమా! నారాయణరావు ఎలాగైనాసరే... ఇంకో పదినిమిషాలు గుమాస్తాను నీ గదిలోనుంచి బయటికి రానీయకు!...ఇదుగో బట్టలేసుకుంటున్నాను..." అని నారాయణరావుకు మానసం దేశం పంపించాను.

నారాయణరా వేదో చెబుతున్నాడు...గుమాస్తా ఏదో అంటున్నాడు!

నారాయణరావు బొంకి వుంటాడు - ఏభైరూపాయలు నిన్ననే భార్యకు పంపించాననీ, పిల్లలకు జబ్బుగా వుందని వుత్తర మొచ్చిందనీ!

గుమాస్తా-పెళ్ళాం, పిల్లలు కలిగిన కుటుంబమంటే కరుణిస్తాడని...ఇటీవలే తెలిసినందున ఈ కిటుకు వేసివుండాలి నారాయణరావు.

ప్రస్తుతానికి ఈ పాతిక తీసుకోమని ప్రాథేయపడుతున్నట్టుంది...

వాళ్ళసంభాషణ ఆలకిస్తూవుంటే నాకు ముప్పరావచ్చునని, మూలనున్న చెప్పులు చేతిలోకి తీసుకున్నాను...పొరపాటున చెప్పుల చప్పుడువిని గుమాస్తా పసిగట్టవచ్చు!

నెమ్మదిగా తలుపువేసి...పిల్లిలాగా నడుచుకుంటూ వెళ్ళి మెట్లుదిగాను. అప్పటికిగాని గుండెదడ ఆగలేదు.

నెమ్మదిగా ఫర్లాంగుదూరంలోవున్న భోజన హోటలుకు బయలుదేరాను !

నారాయణరావుకూడా తెలివైన ఘటం! తెలివి దేముందిలే! అంతా పరిస్థితుల ప్రభావం! నేను మాత్రం తెలివి తక్కువవాడినా? ఐదునెలలు అద్దెకోసం గుమాస్తా వస్తున్నాడని తెలిసి...పిల్లిలాగా బయటికి జారుకున్నాను...

ఏదో పాపం...నారాయణరావుకు క్రిందటినెల వుద్యోగం దొరికిందిగాబట్టి సరిపోయింది...లేకపోతే...నాలాగేచేసి వుండును...అతను ఆరునెలల అద్దెకట్టాలి! పరిస్థితుల ప్రభావం కాకపోతే...అతగాడి బాధనుంచి తప్పుకోవడానికిగాను—తనకు పెళ్ళియిందనీ, పిల్లలున్నారని చెప్పుకోవటం దేనికి? నారాయణరావుదే పెళ్ళికాలేదు. అంతావర్తిది! ఆ ఏభైరూపాయలూ హోటల్ యజమానికి చెల్లించటం నిన్న నాకళ్ళారాచూశాను!

హోటల్ దగ్గరించింది.

యజమాని వెంకట్రామయ్య నన్నుచూసి సన్నగా నవ్వాడు; నేను ఒక చిరునవ్వు విసిరేశాను.

ఈ వెంకట్రామయ్య గారుకూడా చాలా విచిత్రమైన మనిషి. ఈయన గత ఐదుమాసాల్నుంచి నన్ను పోషిస్తున్నాడు. రెండుపూటలా భోజనం....ఉదయం మధ్యాహ్నం కాఫీ...ఈయన

మనుషుల్ని ఊరికే నమ్ముతాడు. ఎవరెలాంటి వాళ్లో పరీక్షించ గల శక్తి తనకుందంటాడు. వ్యాపారి ఎప్పుడూ అధికలాభాల కోసం ప్రయత్నించకూడదట....మధ్య మార్గాన నడిస్తేనే బోలె డంత మిగులుతుందని తన వ్యాపార రహస్యం బయటపెట్టేస్తాడు.

విచిత్రమైన మనిషికాకపోతే ఏమిటి? ఏంజూసి నాకు అప్పుపెడుతున్నాడో ఆయనకే తెలియాలి! వెళ్ళి ఆయనకు దగ్గర్లోవున్న టేబుల్ దగ్గర కూర్చున్నా!

"ఏమండీ! బావున్నారా?" రోజూవేసే అర్థంలేని ప్రశ్నే ఇవాళ్ళకూడా వేశాను!

"ఏదో మీదయ!" అన్నాడాయన రోజుటికిమల్లేనే!

రోజుటికి మల్లేనే ఆయన — ఆరోజు పత్రిక నాచేతి కందించాడు. ఆయన ఉద్దేశ్యం నాకు తెలుసు; 'నీకు తగిన ఉద్యోగాలేమైనా వున్నాయేమో చూసుకో!' అని ఆయన భావన!

నేను అలాగేచేయవచ్చునా? చేయలేదు. ఏదో వార్త లంటే మహా అభిరుచి వున్నవాడికిమల్లే - మొదటి పేజీమీదికి దృష్టిని పోనిచ్చాను. నిజం చెప్పొద్దూ - పతాక శీర్షికలుకూడా అర్థంకాలేదు. యథాప్రకారం 'వాంటెడ్ కాలమ్స్' చూడ్డం ఆరంభించాను.

"ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరకాలంటే మినిస్టరు ఛాయాలో బంధుత్వం కల్గివుండాలంటాను - శీతారామయ్య గారూ! మీరేమంటారు?" అని పేపరుమీద దృష్టి అలాగేవుంచి అన్నాను. ఆయన 'ఔ' ననటానికి బదులు 'ఇదిగో చూశారూ?' అని ప్రారంభించాడు.

నేను మాత్రం ఏ మూలనైనా నాకుసరిపడ్డ వుద్యోగం దొరుకుతుందేమోనని.... మహాశ్రమ పడుతున్నా! ఊహూ.... ఐదొందలు, వెయ్యి, పదిహేనొందల జీతాల వాళ్ళకు వుద్యోగా లున్నాయట....ఇంజనీరింగు డిప్లొమా హోల్డర్లకు కూడా మంచి అవకాశాలున్నాయి...కాని పట్టి బి. యే. గాళ్ళకు ఏమీ లేవు! అయినా ఇంకా పత్రిక చూస్తూనే వున్నాను.

"ఓపిక పట్టాలి.... ఆరోజు రావాలి అన్నారు వెంకట్రామయ్యగారు. అలాగని ఆయన ఊరుకోలేదు....తను అనుభవించిన కష్టాలను గురించి వర్ణిస్తున్నాడు....ఆ కష్టాలు ఒకరోజున తీరి పోయాయట. అవి పంచశీల సిద్ధాంతానికి నాందీ ప్రస్తావన జరిగిన రోజులట! అందుకే తన హోటలుపేరు 'శాంతివిలాస్' అని పెట్టాడట. అంతదాకా పడరానిపాట్లు పడ్డాడట...అద్దె చెల్లించటానికి సైతం డబ్బుండేది కాదట...ఒకపర్యాయం ఇంటి యజమాని సామానుతీసి బయట పడేశాడట...ఈ ప్రసక్తి వచ్చేప్పటికి నాకు పత్రికలో అక్షరాలు కన్పించటం మానేశాయి... వెంకట్రామయ్యగారు ఆ తరువాత ఏంచెప్పాడో నా చెవులు ఆలకించలేదు...నా కళ్ళెదుట...ఉదయం చూసిన స్వప్నం మెదలుతోంది. స్వప్నంలో లభించిన ఉద్యోగం తాలూకు సంగతులు కదుల్తున్నాయి.

ఎంత మధురమైన స్వప్నం! అది నిజంగా మారితే ఎంత బావుంటుంది?

ఊసురో మనుకుంటూ ఉండేదానికంటే కనీసం ఇలాంటి స్వప్నాల్లో జీవించటం కూడా అవసరమేమో ననిపించింది, నాకా విషయంలో.

సీతారామయ్యగారు తన స్వంతగొడవ చెప్పడం ఎప్పుడు ఆపివేశాడో నేను గమనించలేదు. ఆయన గొడవ నాకు కొత్త దయితేగా? ఆయనకు 'మూడ్' రావటం ఆలస్యం, గతంలోకి వెళ్ళిపోతాడు. అలా వెళ్ళిపోయి – మానవుడికి సంఘర్షణ తప్ప దని తేలుస్తాడు! ఏతావాతా ఆయన చెప్పదలచిందేమిటంటే "ఫరవాలేదులే నాయనా! నీకు ఉద్యోగం వచ్చినప్పుడే నాకు డబ్బివ్వు! అంతదాకా ఇక్కడే తింటూవుండు!'

నారాయణరావుకు ఉద్యోగం రావటంతోటే-కొంతబాకీ చెల్లగొట్టేశాడు; అలాగే నేనూ చెల్లగొట్టేస్తానని ఆయన నమ్మకం!

"వస్తానండి!" అని చెప్పేసి గదికి బయలుదేరాను. ఉదయం పదిన్నర దాటింది. మెట్లెక్కుతూంటే మళ్ళా దడ పుట్టుకొచ్చింది...

పై కెళ్ళి ఆఖరు మెట్టుదగ్గర నిలబడిపోయాను. ఎందుకో నాకింకా భయం భయంగానే ఉంది...ఇంకా ఆ మీసాలపోతు అక్కడే వుంటే ఏంచెయ్యాలి?...కాని ఇది కేవలం నా భ్రమ మాత్రమేనని పూర్తిగా పైకెళ్ళాక తెలిసింది. పైన ఎక్కడా ఒక్క పురుగులేదు. అంతటా నిశ్శబ్దం...అంతటా శూన్యత... ఇంతకు క్రితం పత్రికలో వాంటెడ్ కాలమ్సులో చూశాక నాలో ఏర్పడిన శూన్యత లాంటిది! అలాంటి వాతావరణం చూసేప్ప టికి నా వళ్ళంతా చెమటలు పోసింది...ఒంటరిగా కూర్చొని సాయంత్రంపూట 'రేపు'ను గురించి ఆలోచించినప్పుడల్లా నాకు చెమటలు పోయటం అలవాటే! కాని సమయంకాని సమ

యంలో-ఇప్పుడు చెమటలు కారటం ఎందుకో నా కర్థంకా లేదు. ఇంత పిరికితనం నాలో పనిచేస్తున్నందుకు నామీద నాకే కోపం వచ్చింది. క్రిందటి నెలారంభంలో ఏవిధంగా ధైర్యంగా నిలబడి సమాధానం చెప్పానో ఈనెల కూడా అదేవిధంగా చెప్పాల్సింది—ఉద్యోగం రావటం ఆలస్యం - మొదటినెల జీతమంతా నీ అద్దెకింద జమకడతానని ! కాదంటే మేడమీదనుంచి కింద పడేస్తాడా ఏం ? యెలా పడేస్తాడో చూస్తాను !...

నాలో కొంచెం ధైర్యం చోటుచేసుకుంది ... పిరికితనం ఎగిరిపోయింది.

ఆ ధైర్యంలో వెళ్ళి నారాయణరావు తలుపు తట్టాను! లోపల్నుంచి సమాధానం లేదు. యీసారి గట్టిగా తలుపు తట్టాలని చూసేప్పటికి...బయట వేసివున్న తాళంమీదికి దృష్టి పోయింది. నా తెలివితక్కువతనాన్ని చూసి నాకే జాలేసింది. కాని ఇంతకుక్రితం కలిగిన నా ధైర్యానికి నేనే మెచ్చుకోక తప్పలేదు. అసలు ఇంత ధైర్యంగా గుమాస్తాను గురించి ఆలోచిస్తానని నే నెప్పుడూ అనుకోలేదు.

ఏదో విజయం సాధించిన వాడికిమల్లే నవ్వాను!

నారాయణరావుకు కిందటినెల ఉద్యోగం వచ్చిన విషయం మాటిమాటికి మరచిపోతున్నందుకు మళ్ళీ నామీద నేను విసుక్కున్నాను!...ఓహో ! మిష్టర్ నారాయణరావు ఇప్పుడు పంఖాకింద కూర్చొని కిటికీలకు కట్టిన వట్టివేళ్ళ తడికల సువాసన ఆఘ్రాణిస్తూ ఫైళ్ళు తిరగేస్తూ వుంటాడు. .నోట్

'పుటప్' చేస్తూ వుంటాడు. . .ఇంకోగంట తాళాక "ఏయ్ భాయ్! ఏక్ చాయ్!" అంటాడు గాబోలు!. . .నారాయణ రావూ!. . .అదృష్టమంటే నీదయ్యా! కానియ్, కానియ్!. . . యీ భవదీయుడి రోజులు మాత్రం మారవా ఏమిటి? వీడి కలలు మాత్రం నిజం కావంటావా?

"అవుతాయ్!" అను నారాయణరావూ! 'అవుతాయ్!' అను. 'రేపు'మీద నమ్మకం నాకు నువ్వు కలిగించకపోతే ఈ ఊళ్ళో మరెవరున్నారు చెప్పు! లక్ష్మి ఉందనుకో! కాని ఆమె ఇక్కడ లేదుగా! రెండొందల పైచిలుకు మైళ్ళదూరంలో ఒక మారుమూల గ్రామంలో వాళ్ళ మేనమామగారింటి మారు మూలగదిలో ఒంటరిగా. . .ఎవరికోసమో నిరీక్షిస్తూ కాలం గడుపుతోంది. . .నీకు చెప్పానుగా లక్ష్మిని గురించిన సంగతులు!. . .నిజంగా నువ్వూ, ఆమె లేకపోతే యీ జీవితం ఎప్పుడో "భయం భయం"గా మారి దుర్భరమైపోయేది!. . . అంతసేపు నారాయణరావు గదిముందు నిల్చొని అంత దీర్ఘంగా ఆలోచించటం నాకేమీ ఎబ్బెట్టుగా తోచలేదుగాని. . .పొరపాటున ఎవరైనా చూస్తేమటుకు నాకు నిజంగా మతి భ్రమించిందని అనుకోవటానికి ఆస్కారం లేకపోలేదు!. . . కాని అలా అనుకునేందుకు పైన ఎవరూ లేరు. అంతా ఎవరి పనులమీద వాళ్ళు వెళ్ళిపోయారు. ఇక మిగిలిందెవరయ్యా అంటే పనిలేని ఈ రెండోగదిలో ఉంటున్న – మధుసూధనరావు దీ గ్రేట్ – బి. ఎ. (ఎకనమిక్స్.)

తలుపు తెరిచాను. తెరిచి తెరవటంతోటే నేలమీద నీలంరంగు కవరు కన్పించింది.! పోస్టుమేన్ తలుపుకిందగా లోనికి నెట్టిన ఆ నీలం కవరు ఎవరురాశారో నాకు తెలుసు! అయినా, ఎవరో కొత్తవాళ్ళు రాసిన ఉత్తరంగా భావించి . . . ఎడ్రసు రాసిన దస్తూరీని పరికిస్తున్నాను. పరికించి కవరుచించాను.! అందమైన నీలిరంగు కవరులో అందమైన నీలిరంగు కాగితాలు! ఆ కాగితాలమీద లక్ష్మి రాసిన ముత్యాల్లాంటి అక్షరాలు! ఆ అక్షరాలమాటున లక్ష్మి పొదిగి పొదిగి కూర్చింది. నామీద తనకున్న ప్రేమను! ఆఖరున తన కిందటిసారి ఉత్తరానికి సమాధానం రాయనందుకు కొంచెంగా కోప్పడింది!.

వెంటనే లక్ష్మి ఉత్తరానికి సమాధానం రాయటానికి కూర్చున్నాను! అప్లికేషన్లకోసంకొన్న తెల్లకాగితాల పొత్తిలో నుంచి ఒక కాగితం బయటికి లాగేను!

లక్ష్మి నీ ఉత్తరాలు నాలో ఒక కొత్త ఆశను రేకెత్తిస్తూ ఉంటాయి. ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూ ఉంటాయి. వారానికొక ఉత్తరం చొప్పున నీ దగ్గర్నుంచి రాకపోతే నాకు పిచ్చెక్కినట్లవుతుంది! నాలో మిగిలివున్న ఆశకాస్తా అరిస్తుందేమోనని భయమేస్తూ ఉంటుంది.! . . మనిషిలోని ఆశ అంతరించాక... ఇక – ఆ . . . నీ ఉత్తరం చదివాను . . . అవును నాకు తెలుసు – మన పెళ్ళయి తీరుతుంది. ఆలస్యం చేస్తున్నది నేనే? అవును. . . అవును . . . కొంచెం ఓపిక వహించులక్ష్మి . . . మరి కొన్నాళ్లు..."

ఇలాగే రాశాను, చాలా సంగతులు రాశాను. లక్ష్మి
రాసినన్ని పేజీలు రాయలేదుగాని, మొత్తానికి చాలా రాశాను... ఏం రాశానో మళ్ళీ చదువుకున్నాను. "ఏమో లక్ష్మీ గమ్యం చేరుకోవాలని... స్థిమితం చేకూర్చుకోవాలని... పోరాటం సాగిస్తున్నాను...కాని అడుగడుగునా అసంఖ్యాకమైన అడ్డంకులు ఎదురవుతున్నాయి...అసలు దారీ తెన్నూ అనేది ఎప్పటికయినా కన్పిస్తుందా? అని అనుమానం వేస్తూంటుంది. ఆ అనుమానం నీ ఉత్తరాలు తగ్గించి వేస్తుంటాయి..." అని ఉత్తరం ముగించాను.

కిందటిసారి ఉత్తరానికి సమాధానం ఎందుకు రాయలేదో దాన్ని గురించి రాయకుండా ఉండటమే మంచిదనుకున్నా! లేకపోతే - 'ఉత్తరం రాయటానికి నా దగ్గర డబ్బులు లేక పోయాయి' అని రాస్తే ఆమె బాధపడుతుంది! ఆమె బాధ పడటం నా కిష్టంలేక ఆ విషయం ప్రస్తావించటం మానేశాను.

ఆ తరువాత ఆ ఉత్తరాన్ని మడిచి పక్కన బెట్టాను. సాయంత్రం నారాయణరావు ఆఫీసునుంచి రావటంలో ఒక కవరు కొనటానికి పదిహేను నయాపైసలు అప్పుతీసుకోవాలి! ఈమాత్రం అప్పు అతడి దగ్గర పుట్టకపోదు. నిన్నేగా జీతం తీసుకున్నది! అప్పుడే చాప పక్కనేఉన్న ఆంధ్రపత్రికమీదికి నా దృష్టిపోయింది. నారాయణరావు తన మొదటి జీతం డబ్బుల్లోనుంచి మొదటిసారిగా కొన్న పత్రికిది!...

ఖర్చు వివరాలురాసి ముఖచిత్రాన్ని చెడగొట్టాడు! పేజీలు తిరగేశాను. రాత్రి చదివినవన్నీ ఒక్కసారి మళ్ళీ నెమ

రుకువచ్చాయి. ఆ అమ్మాయి ఎవరోగాని కుటుంబ నియంత్ర ణాన్ని గురించి బాగా రాసింది! ఆ వ్యాసం చదువుతున్నప్పుడు నాకు మాటిమాటికీ బెర్ట్రాండ్ రసెల్ రాసినకొన్ని విషయాలు గుర్తొచ్చాయి ! ఒకచోట ఆయన ప్రపంచంలో ప్రస్తుతం రోజుకు ఏభై ఎనిమిది వేలమంది జన్మిస్తున్నారన్నాడు ! దీన్ని అరి కట్టాలన్నాడు ! ఇండియాలాంటి దేశంలో జీవన పరిమాణం పెరగాలంటే బర్త్ కంట్రోలు అవసరమన్నాడు ! దీనివల్ల ఎన్నో సమస్యలు పరిష్కార మవుతాయన్నాడు !

పత్రికలోని ఆ వ్యాసాన్ని చించి లక్ష్మికి పంపాలనిపించింది. కాని మరో నిమిషంలో నా పిచ్చికి నేనే నవ్వుకున్నాను ! 'పెళ్లి అనుకున్నారో లేదో, ఏమిటి అబ్బాయికి పిచ్చి!" అని ఎవరైనా అనుకుంటే పెళ్లి కావలసిన కుర్రాడి విషయంలో ఏంమర్యాదగా ఉంటుంది ? అందుకని ఆ భావనకు ఫులిస్టాప్ పెట్టి – ఆపత్రికను భద్రంగా పరుపు చుట్టక్రింద దాచిపెట్టాను. ఎప్పుడైనా మంచిదని !

బయటికొచ్చి నిలబడ్డాను !

రోడ్డుమీద అడపాదడపా మనుషులు నడుస్తున్నారు :

చేతికి గడియారమున్న పెద్దమనిషి ఒకాయన కన్పించే టప్పటికి నేను పైనుంచే పిట్టగోడమీదుగా కిందికివంగి – వాటిజ్ దిటైంప్లీజ్' అని ఒక చిన్నసైజు కేకేసి అడిగాను !

ఏక్ బజాహై అన్నాడాయన ! అంటే, ఒంటిగంటయిం దన్నమాట ! అని నాలో నేను కూడబలుక్కున్నాను.

థేంక్స్ అనేలోపలే ఆయన అయిదారడుగులు ముందుకు వెళ్లిపోయాడు ! నేను గబగబా లోనికెళ్ళాను !

అసలు విషయం మరచే పోయ్యాను! మూడుగంటలకు–ఒక ఇంటర్వ్యూలాంటి దానికి హాజరుకావాలి. ఖైరతాబాద్‌లో! దీనివల్ల నాకు ఒరిగేదేమీ లేదని నాకు తెలుసు ... ఇలాంటివి ఎన్ని కాలేదు గనుక!

అయినా వెళ్ళాలి! కొంచెం డాబుసరిగా వెళ్ళాలి!

ముందు గడ్డం చేసేకోవాలి?

గబగబా అద్దంముందు కూర్చొని రేజరు సరిజేసుకున్నాను! ఆ తరువాత గడ్డం గీచుకోవటానికి ఉపక్రమించాను ... అబ్బా! ఏమని చెప్పను? పరిస్థితులు నామీద తిరుగుబాటుచేసిన విధంగానే ఆబ్లేడుకూడా నాగడ్డాన్ని నానాహింసలకు పాలు జేసింది! ‘ఈ శరీరం నాది కాదు. ఎవడో పరాయివాడిది! అనేభావంతో డాక్టరు ఏ విధంగా ఆపరేషను చేస్తాడో, అదే విధంగా నేను రేజరుతో సాముచేశాను! అలా చేశాక ... చిన్నపిల్లల గడ్డం పుచ్చుకొని బతిమిలాడతారే అట్లా నేను కూడా నా చేతిలో గడ్డాన్ని పట్టుకొని బుజ్జగించాను — ఇవ్వాళ నారాయణరావు నడిగి పదిహేను నయాపైసలతో పాటు మరో పన్నెండు నయాపైసలు తీసుకొని కొత్త బ్లేడు కొంటాను !’

‘నమ్మకం లేదనుకుంటూనే మనం కొన్ని పనులు చేయాలి, తప్పదు !’ అని అనుకుంటూ స్నానం చెయ్యటానికి

కిందికెళ్ళాను! స్నానాల గదిలో కూనిరాగంతీస్తూ చాలాచాలా ఆలోచించాను!

స్నానంచేసి పైకి వచ్చేటప్పటికి తలుపుకిందగా బాదం రంగు కవరొకటి లోనికి ప్రవేశించి నాకోసం ఎదురుచూస్తోంది తుండుగుడ్డా, సబ్బుపెట్టె చాపమీదకి విసిరేసి — అట్లాగే వాకిట్లో కూర్చుని కవరుచించాను. ఎందుకో ఉదయం వచ్చిన కల గుర్తుకొచ్చింది! ఆశగా, ఆతురతగా కవరు తెరిచాను. రెండేరెండు పంక్తుల సమాధానం: 'నీ అప్లికేషను అందింది. ఆ ఉద్యోగాం నీకివ్వటం సాధ్యపడదు!'

ఆ వుత్తరంచూసి నేను నిలువునా నీరు కారలేదు, నిరాశలో కుంగిపోలేదు! ఇలాంటివెన్ని జరిగాయో? అయితే నాకు నవ్వొచ్చింది — అంతకు కొద్ది క్షణాలపూర్వం ఆ ఉత్తరాన్ని చూసి ఆశాభావాన్ని కల్పించుకొని వుదయంచూసిన స్వప్నాన్ని స్మృతికి తెచ్చుకున్నందుకు!

వెంటనే చాపమీద పడుకొని వుదయంచూసిన కల లాంటిదాన్ని మళ్ళీ కనాలనిపించింది. కాని ఇప్పుడెలా? ఖైరతాబాదు వెళ్ళాలి! మూడింటికి ఇంటర్వ్యూ! ఏమో ఎవరు చూశారు? లక్ష్మి నన్ను ప్రేమించినట్టుగానే ఆ వుద్యోగం కూడా నన్ను వరిస్తుందేమో!

నిజంగా నాకు ఉద్యోగంవస్తే ఎంతమంది సంతోషిస్తారు!

ఆ రోజున లక్ష్మి మొహంమీద వెన్నెల తాండవిస్తుంది!

హోటలు ప్రొప్రయిటరు—'నేను చెప్పలేదు నాయనా!' అంటాడు.

నారాయణరావు దగ్గర పదిహేను నయాపైసలు అప్పు చేయాల్సిన అవసరముండదు !

అద్దె వసూలుచేసే గుమాస్తా కర్ర చంకనబెట్టుకొని మరీ మాట్లాడిస్తాడు !

ఆ రోజు !

ఆరోజు ఎంత మంచిరోజు !

ఆ మంచిరోజుకోసం ప్రయత్నించేందుకు నేనూ బయలు దేరి వెళ్తున్నా ! బై, బై !

—)o(—